# ప్రయాణం

సంచీ చేతపుచ్చుకుని ఇంట్లోనించి బయటకు రాగనే "ఎక్కడికి ప్రయాణం?" అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే మీకెంత కోపంవస్తుంది? కాని, నారాయణకు అసలు కోపం రాదు. కోపంరాదు సరికదా ఎంతో సంతోషపడిపోతాడు.

గర్వంగా అలా అడిగిన వాళ్ళకేసి చూసి తాను ఏ వూరుకు బయల్దేరిందీ, ఆ వూరు చేరటానికి తను ఎన్ని బస్సులు లేక ఎన్ని రైళ్లు మారవలసి వుండేదీ ఎన్ని గంటలకు ఆవూరు చేరేది అన్నీ వివరంగా చెబుతాడు. చివరకు తను ఎప్పుడు తిరిగివచ్చేదీ కూడా చెబుతాడు నారాయణ.

అందుకే ఆవూళ్ళో నారాయణ ఇంటి పేరును అంతా ఎప్పుడో మరచిపోయారు. ఇప్పుడు అతడిని అంతా ప్రయాణాల నారాయణ అంటారు. తెలియనివాళ్ళయితే 'ప్రయాణాల' అనేది అతని ఇంటిపేరని అనుకుంటారు.

ప్రయాణాల నారాయణ అంటే నారాయణ ఎంత ఆనందపడిపోతాడో! కొంత మంది చిన్నపిల్లలుకూడా ఆయన ఎదురుపడితే 'ప్రయాణాల నారాయణగారూ.... ఎక్కడికి ప్రయాణం?' అని అడుగుతారు. చిన్నపిల్లలు కదా అడిగింది అని నిర్లక్ష్యం చెయ్యడు నారాయణ వాళ్ళకికూడా అన్నీ వివరంగా చెప్పి మరీ వెళతాడు.

ఎందుకో నారాయణకు ప్రయాణం అంటే అంత ఇష్టం .... ఏదయినా ముందుగా తెలిసిన ప్రయాణమైతే దానికి రెండు రోజులు ముందునించే సన్నాహాలు మొదలు పెడతాడు. బట్టలన్నింటినీ తెల్లగా మల్లెపువ్వులా వుతుక్కుంటాడు. వాటిని మడతలుపెట్టి ముందుగానే సంచిలో సర్దుకుంటాడు.

బస్సు రావటానికి రెండు గంటలు ముందుగానే ఇంట్లోనించి బయటకు వస్తాడు.... ఎవరో ఒకరు అతడి ప్రయాణం గురించి అడగనే అడుగుతారు. వాళ్ళందరికీ తన ప్రయాణం గురించి చెప్పుకుంటూ బస్సుదగ్గరకు చేరేసరికి ఆ రెండు గంటలూ పూర్తిగా గడిచిపోతాయి.

ఎవరయినా నారాయణను "ప్రయాణాలంటే నీకెందుకింత ఇష్టం?" అని అడిగితే ఆయన చిద్విలాసంగా నవ్వి "ఒక్కో మనిషికి ఒక్కో రకమైన సరదా వుంటుంది. నాకు ప్రయాణమంటే సరదా ....ప్రయాణం చేస్తుంటే అనుభవాలు చాలా చిత్రంగా వుంటాయి.... ఎప్పుడూ ఇంట్లోపడి కూర్చుంటే ఏముంది జీవితం?" అని ఎదురుప్రశ్న వేస్తాడు....

అప్పుడిమటుకు నారాయణ గొప్ప మేధావిలా కనిపిస్తాడు.... ఒక రకంగా ఆయన ఆలోచన సరయినదేనేమో అనిపిస్తుంది....

నారాయణ తన సొంత పనులమీదనే

ప్రతాప రవిశంకర్

ప్రయాణాలు చేస్తూవుంటాడని అనుకుంటే పొరపాటు పడినట్టే లెక్క.... ఆయన ఎవరి పనిమీదయినా ప్రయాణాలు కడుతూవుంటాడు.... ఆ వూళ్లో ఎవరికయినా ఏదయినా పనివుండి ఏ పట్నంనించో ఏదయినా వస్తువు కావలసి వచ్చినప్పుడు వాళ్లు నారాయణను పంపిస్తూ వుంటారు. అప్పుడు నారాయణకు ఒంట్లో బావుండకపోయినా, ఓపిక లేకపోయినా లేని శక్తిని తెచ్చుకుని ఆ పనిమీద వూరికి బయల్దేరుతాడు.

ఒక్కోసారయితే కొంతమంది కుర్రాళ్లు ఎప్పుడయినా పట్నానికి బయల్దేరితే కావాలని నారాయణను వెంటపెట్టుకుని వెళుతూవుంటారు. ఆయన్ని వెంట తీసుకువెళితే బాగా కాలక్షేపంగా వుంటుంది. ఏవో కబుర్లు చెబుతూనే వుంటాడు. అంతేకాదు. పట్నంలో ఎంత దూరం తిప్పినా తిరుగుతాడు. ఎవరైనా కొన్ని పరుకులన్నింటినీ ఓపిగ్గా పట్టుకుంటాడు. ఏ దుకాణం దగ్గరయినా కూర్చోపెడితే మళ్లీ ఆ మనుషులు తిరిగొచ్చేవరకూ కదలకుండా అక్కడే కూర్చుంటాడు....

అందుకే ఆ వూళ్లో నారాయణ అందరికీ స్నేహితుడు.

చిన్నతనంనించే నారాయణకు ప్రయాణాలంటే ఈ సరదా వుండేట....అప్పుడే ఎవరు పిలిస్తే వాళ్ళతోకలసి ఇంట్లో చెప్పకుండానే వెళ్ళిపోయేవాడుట. అతనికోసం వూరంతా వెతుకుతుంటే ఎప్పుడో వూరినించి దిగేవాడట.

తన చిన్ననాటి ప్రయాణాల అనుభవాలగురించి నారాయణే ఎవరయినా అడిగినప్పుడు చెబుతూవుంటాడు.

నిద్రపట్టక సతమతమయ్యే మనుషులకు నారాయణ అవూళ్ళో మంచి కాలక్షేపం. ఆయన్ని పిల్చి కాల్చుకోటానికి సిగరెట్టునో, చుట్టముక్కనో ఇస్తే ఇహ కదలకుండా కూర్చుని అర్ధరాత్రి దాటేవరకూ కబుర్లు చెబుతూనే వుంటాడు....

నారాయణ చిత్రమైన మనిషి. ఆ వూళ్లో ఏదయినా కార్యం జరిగిందంటే నారాయణ అక్కడ వుండితీరుతాడు. ఏక్షణాన ఏ అవసరమొచ్చినా నిముషాల మీద ప్రయాణానికి సిద్ధమయిపోతాడు. ఎవరింటికయినా రావలసిన సైముకు రారేదనుకోండి, అప్పటికప్పుడు వాళ్ళకో చెప్పి వాళ్ళకోసం ప్రయాణం కడతాడు.

ఎవరైనా ఏ చెట్టుమీదనుంచో, ఇంటిమీదనుంచో కిందపడ్డాడనుకోండి..వాడిని అప్పటికప్పుడు ఏ బండిమీదనో, బస్సులోనో వేసుకుని వెళ్ళేమనుషుల్లో నారాయణ తప్పకుండా వుండితీరుతాడు....

ఇలా నారాయణ అవూరి మనుషుల్లో, వాళ్ళ మనసుల్లో ఓ ప్రత్యేకమైనస్థానాన్ని ఆక్రమించుకున్నాడు.

బస్సులోగాని, రైల్లోగాని ఎక్కాడంటే నారాయణ కిటికీప్రక్కగా వుండే సీటునే సంపాదించటానికి ప్రయత్నంచేస్తాడు.

ఇహ కిటికీ ప్రక్కనే కూర్చుని ప్రక్కనే కూర్చున్న మనుషులను పలకరిస్తాడు.

ఏ వూరు మీది? ఎక్కడిదాకా వెళుతున్నారు? ఇంతకుముందు ఎప్పుడయినా అవూరు వెళ్ళారా? ఎన్నిరోజులు అక్కడ వుంటారు?

అన్నీ ఇలాంటివే ప్రశ్నలు.

అవతలి మనిషి ముభావంగా వున్నా తన ప్రశ్నలకు జవాబులు వచ్చేవరకూ వూరుకోడు.... వేధిస్తూనే వుంటాడు....

ప్రశ్నలన్నీ అయిన తర్వాత తన ప్రయాణం గురించిన వివరాలను చెబుతాడు తర్వాత లోకాభిరామాయణమంతా మాట్లాడుతాడు. రాజకీయాల గురించి మాట్లాడుతాడు. పెరుగుతున్న ధరల గురించీ, దొంగతనాల గురించి కూడా ఎక్కువగానే మాట్లాడుతాడు.

ఎప్పుడయినా ప్రయాణం మధ్యలో ఎక్కడో బస్సు చెడిపోయిందంటే ఎవరికైనా ఎంతో విసుగ్గా వుంటుంది. కాని నారాయణకు అసలు విసుగనిపించదు. ఎన్ని గంటలయినా అక్కడే బస్సు బాగు చేస్తుంటే వాళ్ళదగ్గర కూర్చుని అంతా చూస్తూ వుంటాడు. లేకపోతే ఎవరో ఒక ప్రయాణీకుడిని పట్టుకుని కబుర్లలో దించుతాడు.

బస్సు ప్రయాణంకంటే రైలు ప్రయాణమంటే ఆయనకు ఎక్కువ ఇష్టం .... వాళ్ళ వూరికి రైలు లేదు.... ఇంకేదైనా దూరమైన వూరికి ప్రయాణం దొరికితే పట్నానికి వెళ్ళి అక్కడినించి రైల్లో ప్రయాణం చేస్తాడు నారాయణ రైల్లో ప్రయాణం చేసేటప్పుడయితే ఎన్నో స్టేషన్లు వస్తూవుంటాయి. పరుగెత్తుతూ రైలు చేసే చప్పుడు, స్టేషను రావటంతోనే వేగం తగ్గి ఆగిపోవటం... మళ్ళీ స్టేషన్లో గంటలు కొట్టటం -విజిల్ వూదటం.... ఇవన్నీ నారాయణకు ఎంతో హుషారుగా కనిపిస్తాయి. రైల్లో అయితే రకరకాల తినుబండారాలు అమ్మే మనుషులు వస్తూ వుంటారు. వేరుశనగ పాకమంటే నారాయణకు బలే ఇష్టం.... అది గనుక వచ్చిందంటే ఎంతో కొంత కొనుక్కుని తినకపోతే నారాయణకు ఆరాత్రి నిద్రపట్టదు.

తన ప్రయాణాలంటే నారాయణ భార్యకు అసలు గిట్టేదికాదు. పెళ్ళయిన తొలిరోజుల్లో కూడా అతను ఏరాత్రి తొమ్మిదిగంటల సమయంలోనో ఎవరైనా వచ్చి పట్నందాకా వెళ్దాం రమ్మంటే వెంటనే వెళ్ళిపోయేవాడు.... కొన్నిసార్లయితే భార్యతో నారాయణకు ఈ ప్రయాణాల విషయమై గట్టి దెబ్బలాటలే జరిగాయి. చివరకు తన ప్రయాణాలు ఇష్టంలేకపోతే భార్యను ఇంట్లోనించి వెళ్ళిపొమ్మన్నాడు. పాపం.... అప్పటినించీ ఆమె నారాయణ ప్రయాణాల గురించి పల్లెత్తుమాట అనలేదు. అలా అనకుండానే నాలుగేళ్ళక్రితం శాశ్వతంగా ఈ లోకంనించి వెళ్ళిపోయింది.

ఏళ్లు గడిచాయి. నారాయణ ముసలి తనంలో అడుగుపెట్టాడు. అయినా అయనలో ప్రయాణ పట్ల వున్న ఆసక్తి రవంతకూడా తగ్గలేదు ఆ ఉత్సాహం అణుమాత్రంకూడా తరిగిపోలేదు ఈ రోజుకీ ఆయన ప్రయాణాల నారాయణే..

ఎవరికి ఏ అవసరంవచ్చినా పట్నానికి పరుగుదీసేది నారాయణే–అలాంటి నారాయణకు ఓ పదిరోజులనించీ జ్వరంగా వుంది.

• • •

ఆరోజుకూడా నారాయణకి జ్వరం పూర్తిగా తగ్గలేదు. కొంచెంగా తగ్గింది. ఐనా చాలానే నీరసంగా వున్నాడు. ఇన్ని రోజులనించీ ఆ వూళ్ళోవున్న సుదర్శనాచారిగారి దగ్గిరే జ్వరానికి మందు తీసుకుంటున్నాడు.

ఒక గంటక్రితమే నారాయణకోసం ఎవరో వచ్చారు - పట్నానికి వెళుతూ ఆయన్నికూడా తీసుకెళదామని. కాని జ్వరం పూర్తిగా తగ్గలేదని వెళ్ళిపోయారు. అలా వుండికూడా నారాయణ ప్రయాణానికి సిద్ధంకావాలనే అనుకున్నాడు. కాని వాళ్లే ఒప్పుకోలేదు.

చలిగావుంది పాత దుప్పటిని ముసుగు పెట్టి పడుకున్నాడు నారాయణ. ప్రయాణాలు చెయ్యటానికి వీల్లేకుండా చేసిన ఆ జ్వరాన్ని తిట్టుకుంటున్నాడు.

సరిగ్గా ఆ సమయంలోనే ఆ ఇంట్లోకి పోస్టుజవాను వచ్చాడు. నారాయణను నిద్రలేపి ఓ టెలిగ్రాం వచ్చిందని చెప్పి దాన్ని చదివి వినిపించాడు.

ఆ వార్తను వినగానే నారాయణ కూలిపోయాడు. మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడు తర్వాత కుమిలి కుమిలి ఏడ్చాడు.

అక్కడికి వందమైళ్ళదూరంలోవున్న ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న నారాయణకు వున్న ఒకే ఒక్క కొడుకు ప్రమాదం జరిగి చనిపోయాడట. వెంటనే రమ్మని వుంది.

ఇదీ ఆ టెలిగ్రాం సారాంశం.

చాలాసేపటివరకు యేడుస్తూనే వుండిపోయాడు నారాయణ.

తర్వాత సంచీలో గుడ్డలు కుక్కుకుని ఇంట్లోనించి బయటకు వచ్చాడు తాళం పెట్టి.

"ఎక్కడికండీ ప్రయాణాం నారాయణగారూ ప్రయాణం?" అనడిగింది పన్నెండేళ్ళ అమ్మాయి బయటకు రాగానే, ఆయనచేతిలో సంచీ చూసి.

అప్పుడు నారాయణ తన ప్రయాణం గురించి హుషారుగా చెప్పలేదు. పసిపిల్లాడిలా పెద్దగా యేడ్చాడు, అక్కడే కూలిపోయి.

—o—